# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశ రక్షణరంగాన్ని అత్యాధునిక సాంకేతికత ద్వారా బలోపేతం చేస్తున్నామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాధ్ సింగ్ అన్నారు.**

**2.** **అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.**

**3.** **ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నాగాయలంకలో క్షిపణి ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.**

**4.** **రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.**

**5.** **కళాశాలల్లో విద్య పూర్తిచేసిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం లభించేలా పాఠ్యప్రణాళికలను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

==============================

దేశ రక్షణరంగాన్ని అత్యాధునిక సాంకేతిక ద్వారా బలోపేతం చేస్తున్నామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాధ్ సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం రక్షిత అటవీ ప్రాంతంలో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి మాట్లాడుతూ, దేశ రక్షణ, భద్రత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తి లేదని తెలిపారు. రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. దేశ భద్రత విషయంలో రాడార్ వ్యవస్థ పాత్ర కీలకమని రాజనాధ్ సింగ్ పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు)

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ భద్రత విషయంలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతమని పేర్కొన్నారు. దేశ వీఎల్ఎఫ్ రాడార్ ఏర్పాటుకు అత్యంత వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ అని అన్నారు.

-------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ

జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనం పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ నిన్న వాయుగుండంగా బలపడిందని ఇది ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా తీరాల వైపు కదులుతోందని, రేపు పుదుచ్చేరి, నెల్లూరు మధ్య తీరాన్ని తాకవచ్చుని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రానున్న 48 గంటలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. జిల్లాలో వాతావరణ పరిస్థితులపై ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. భారీ వర్షాల సూచన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలపై మా ఆకాశవాణి తిరుపతి జిల్లా ప్రతినిధి ఎన్. జగదీష్ మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ (33 సెకన్లు )

మరోవైపు అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోనూ ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, మహబూబ్ నగర్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నాగాయలంకలో క్షిపణి ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ -సిసిఎస్ ఆమోదం తెలిపింది. వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థలను పరీక్షించడం, ముఖ్యంగా రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. గాల్లోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ, యాంటి ట్యాంక్ క్షిపణులు, వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థలను పర్యవేక్షించనున్నట్లు భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ-డిఆర్‌డిఒ ఓ ప్రకటనలో తెలిపింది.

ఇది ఇలా ఉండగా కృష్ణా జిల్లాలో క్షిపణి ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీకి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఇది కృష్ణా జిల్లాకు గర్వకారణమని,. దేశ రక్షణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ కేంద్రం ముఖ్యపాత్ర పోషిస్తుందని సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బాపట్ల, తూర్పుగోదావరి జిల్లాలలో నిర్వహించిన కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా, రేపల్లెలోని వేజెండ్లవారిలంక , బేతపూడి గ్రామాలలోనిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్థాయిలోను అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. త్వరితగతిన అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 20 సెకన్లు )

---------------------------

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలోని స్థానిక రైస్ మిల్లులో గత రాత్రి పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి, రవాణాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని జప్తు చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ .. పూర్తి సమాచారంతో తనిఖీలు నిర్వహించామని, 103 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించామని చెప్పారు. పేదల ఆహార భద్రతకు సంబంధించిన చట్టం ఉల్లంఘనకు పాల్పడే వారిపై చర్యలు ఉంటాయని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కళాశాలల్లో విద్య పూర్తిచేసిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం లభించేలా పాఠ్యప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాలల్లో చదివే విద్యార్థులకు తగిన నైపుణ్యాలు అందించేలా నైపుణ్యాభివృద్ధి విభాగం పనిచేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లోని ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు సంబంధిత రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరిలో నిర్వహిస్తున్న నైపుణ్య గణనను ఈ నెలాఖరు కల్లా పూర్తిచేసి, రాష్ట్రవ్యాప్తంగా గణన ప్రారంభించాలని మంత్రి సూచించారు.

=====================